క్లుప్తంగా

పెట్రోల్ బంక్‌లో అధికారుల తనిఖీ



పెట్రోల్ బంక్‌లో తనిఖీలు చేస్తున్న అధికారులు

డెంకాడ: మండల కేంద్రంలో ఉన్న పెట్రోల్ బంక్‌లో అధికారులు శుక్రవారం తనిఖీలు చేపట్టారు. సివిల్ సప్‌లెస్ట్ కమిషనర్ ఆదేశాల మేరకు భోగాపురం సీఎస్‌డీటీ మురళి, లీగల్ మెట్రాలజీ ఏసీ రాధాకృష్ణన్ బంక్‌ను పరిశీలించారు. పెట్రోల్, డీజిల్ నాణ్యతతో పాటు వినియోగదారులకు అందించాల్సిన సౌకర్యాలను పరిశీలించారు. ఫ్రీ ఎయిర్ అందుబాటులో లేకపోవడాన్ని అధికారులు గుర్తించారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదానం చేస్తున్న దాతలు

విజయనగరం ఫోర్ట్: రక్తదానం ప్రాణదానంతో సమానమని గాంధీ బ్లడ్ డోనర్స్ క్లబ్ అధ్యక్షుడు అబ్దుల్ రవూఫ్ అన్నారు. శుక్రవారం స్థానిక విజయ బ్లడ్ బ్యాంక్‌లో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మనిషి మాత్రమే ఆపదలో ఉన్న సాటి మనిషికి రక్తదానం చేసి ప్రాణాలు కాపాడగలడని తెలిపారు. రక్తాన్ని తయారు చేయలేం కాబట్టి ఆరోగ్యవంతులు నిరంతరం రక్తదానం చేయాలన్నారు.

వేతనదారులతో మాటామంతీ..

విజయనగరం రూరల్: మలిచర్ల సచివాలయం పరిధిలోని గ్రామాల్లో పనులు చేస్తున్న ఉపాధి హామీ పథకం వేతనదారులతో మండల శాఖ అధికారులు శుక్రవారం మాటామంతీ కలిపారు. మండల ప్రత్యేకాధికారి అరుణకుమారి ఆధ్వర్యంలో మలిచర్ల, సుంకరిపేట గ్రామాలను సందర్శించిన అధికారుల బృందం గ్రామ సమీపంలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల వద్ద ఏర్పాటు చేసిన సౌకర్యాలపై ఆరా తీశారు. అలాగే వేతనదారులతో మాట్లాడారు. వేతనం, పనులు, తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గంటా వెంకటరావు, ఈఓపీఆర్‌డీ డి.తిరుపతినాయుడు, ఏపీఓ గౌరి, మండల శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

వంతెన డిజైన్ల పరిశీలన



డిజైన్లను పరిశీలిస్తున్న ఢిల్లీ హైవే అధికారులు

భోగాపురం: విమానాశ్రయ ప్రయాణికుల సౌకర్యార్థం మండలంలోని రావివలస జాతీయ రహదారిపై నిర్మిస్తున్న వంతెన పనులను ఢిల్లీ హైవే అధికారులు శుక్రవారం పరిశీలించారు. ఎయిర్ పోర్టుకు రాకపోకలు సాగించే ప్రయాణికులతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా మ్యూజికల్ సర్కిల్ పద్ధతిలో వంతెన నిర్మించేందుకు డిజైన్లను రూపొందిస్తున్నామని తెలిపారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న విజయ్, తదితరులు

విజయనగరం: దేవదాయ శాఖ పరిధిలో గల ఆలయాల పాలక మండలిలో నాయీబ్రాహ్మణులకు స్థానం కల్పిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై జిల్లా నాయీబ్రాహ్మణ సంక్షేమ సంఘ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం జంక్షన్ వద్ద పార్టీ యువజన నాయకుడు అవనాపు విజయ్ సమక్షంలో జిల్లా నాయీ బ్రాహ్మణ సంఘం కన్వీనర్ రామేశ్వరం అప్పారావు, జిల్లా అధ్యక్షుడు తోటపల్లి బుజ్జి, గౌరవ అధ్యక్షుడు పండురీ సత్తిబాబు, తదితరులు సీఎం జగన్ మోహన్‌రెడ్డి చిత్రపటానికి 101 లీటర్లతో క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం అవనాపు విజయ్ మాట్లాడుతూ, బీసీలైన నాయీ బ్రాహ్మణులకు ఆలయ పాలక మండలిలో స్థానం కల్పించడం బీసీల పట్ల ప్రభుత్వానికి ఉన్న ప్రేమ, చిత్తశుద్ధిలను తెలియజేస్తోందన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ గాడు అప్పారావు, రౌతు శ్రీనివాసరావు, నాయీ బ్రాహ్మణ సంఘ నాయకులు వేమవరపు నరసింహమూర్తి, రాము, సత్య, సూరిబాబు, పాట్నూరు శివ, మీసాల సత్యనారాయణ, లోకేశ్, బెల్లాపు చైతన్య, వెంపడాపు శీను, కోరాడ శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ఫలించిన బడ్డుకొండ కృషి..

- విజయనగరం రెవెన్యూ డివిజన్‌లోకి నెల్లిమర్ల
- గతేడాది ఏప్రిల్ 4న కొత్త డివిజన్ చీపురుపల్లిలోకి మార్పు
- దూరం పెరగడంతో విజయనగరంలోకి మార్చాలని విన్నపం
- ఎమ్మెల్యే బడ్డుకొండ కృషితో ప్రభుత్వ గెజిట్ విడుదల



నెల్లిమర్ల తహసీల్దార్ కార్యాలయం

నెల్లిమర్ల: విజయనగరం రెవెన్యూ డివిజన్‌లోకి నెల్లిమర్ల నగర పంచాయతీతో పాటు నెల్లిమర్ల మండలాన్ని మార్పుచేస్తూ ప్రభుత్వం తాజాగా గెజిట్ విడుదల చేసింది. గతేడాది ఏప్రిల్ 4న కొత్తగా ఏర్పాటైన చీపురుపల్లి రెవెన్యూ డివిజన్‌లోకి ఈ రెండింటినీ ప్రభుత్వం మార్పు చేసిన విషయం తెలిసిందే. అప్పట్నుంచి సుమారు పది నెలల పాటు చీపురుపల్లి డివిజన్‌లోనే ఉన్నాయి. నెల్లిమర్ల నుంచి చీపురుపల్లి 25 కిలోమీటర్ల దూరంలో ఉంది. ప్రతి పనికీ అంతదూరం వెళ్లాల్సి రావడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. దీంతో నెల్లిమర్ల మండలం, నగర పంచాయతీని విజయనగరం రెవెన్యూ డివిజన్‌లోకి మార్చాలని ప్రజలు కోరారు. ఇదే విషయాన్ని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఆయన స్పందించి విషయాన్ని ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికి తెలియజేశారు. నెల్లిమర్లను తిరిగి విజయనగరం డివిజన్‌లోకి మార్చేందుకు తీవ్రంగా కృషి చేశారు. ఈ నేపథ్యంలో నెల్లిమర్ల నగర పంచాయతీ, మండలాన్ని తిరిగి విజయనగరం రెవెన్యూ డివిజన్‌లో చేర్చుతూ ప్రభుత్వం తాజాగా గెజిట్ విడుదల చేసింది. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నెల్లిమర్ల నగర పంచాయతీలో 20 వార్డులున్నాయి. పట్టణంలో సుమారు 30 వేల మంది జనాభా నివశిస్తున్నారు. నెల్లిమర్ల మండలంలో 33 రెవెన్యూ గ్రామాలు, 28 గ్రామ పంచాయతీలున్నాయి. సుమారు 50 వేల మంది జనాభా నివశిస్తున్నారు. మొదట్నుంచీ ఈ రెండూ విజయనగరం రెవెన్యూ డివిజన్‌లోనే ఉన్నాయి. పరిపాలనా సౌలభ్యం కోసం 2022 ఏప్రిల్ 4వ తేదీన ప్రభుత్వం కొత్తగా చీపురుపల్లి రెవెన్యూ డివిజన్‌ను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈ డివిజన్‌లోకి చీపురుపల్లి నియోజకవర్గంలోని నాలుగు మండలాలతో పాటు నెల్లిమర్ల నగర పంచాయతీ, మండలాన్ని కూడా చేర్చింది. అప్పట్నుంచి ఈ నెల 16వ తేదీ వరకు ఈ రెండూ అదే డివిజన్‌లో కొనసాగాయి. నెల్లిమర్ల నుంచి విజయనగరం కేవలం ఏడు కిలోమీటర్ల దూరంలోనే ఉంది. దీంతో వివిధ పనుల కోసం రెవెన్యూ డివిజన్ కేంద్రానికి వెళ్లడం అంత ఇబ్బందిగా ఉండేది కాదు. అయితే చీపురుపల్లికి మార్చిన తర్వాత ఇబ్బందులు తలెత్తాయి. నెల్లిమర్ల నుంచి చీపురుపల్లి 25 కిలోమీటర్ల దూరంలో ఉంది. దూరం పెరగడంతో వివిధ పనుల నిమిత్తం అంతదూరం వెళ్లడానికి ఇబ్బంది ఏర్పడుతోందని, తిరిగి విజయనగరం డివిజన్‌కు మార్చాలని స్థానిక ప్రజలు ప్రభుత్వానికి విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ఇదే విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు అధికారులను ఎప్పటికప్పుడు కలుస్తూ గెజిట్ విడుదలయ్యేలా చేశారు. ఈ మేరకు నెల్లిమర్ల నగరపంచాయతీతో పాటు మండలాన్ని తిరిగి విజయనగరం రెవెన్యూ డివిజన్‌లోకి మార్పు చేస్తున్నట్లు గతేడాది నవంబర్‌లో ప్రభుత్వం ప్రకటించింది. ప్రజల నుంచి ఎటువంటి అభ్యంతరాలు లేకపోవడంతో ఈ నెల 16న గెజిట్ విడుదల చేసింది. దీంతో ఈ నెల 16వ తేదీ నుంచి నగర పంచాయతీ, మండలం విజయనగరం డివిజన్ పరిధిలోకి వచ్చాయి. దీంతో మండల ప్రజలు ప్రభుత్వానికి, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడుకూ కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. ఈ విషయమై నెల్లిమర్ల తహసీల్దార్ కేవీ రమణరాజు మాట్లాడుతూ నగరపంచాయతీ, మండలాన్ని చీపురుపల్లి రెవెన్యూ డివిజన్ నుంచి విజయనగరం రెవెన్యూ డివిజన్‌కు మార్పుచేస్తూ ప్రభుత్వం గెజిట్ విడుదల చేసిందన్నారు. ఈ మేరకు ఆ దిశగా చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు.

చిరుధాన్యాలతో ఆరోగ్యం



కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా యువజన అధికారి విక్రమాదిత్య

డెంకాడ: చిరుధాన్యాలతో ఆరోగ్యం మెరుగుపడుతుందని నెహ్రూ యువకేంద్ర సంఘటన్ జిల్లా యువజన అధికారి జి. విక్రమాదిత్య అన్నారు. చిరుధాన్యాలు, ఆరోగ్య సిరులు యూత్ పార్లమెంట్‌లో భాగంగా చింతలవలస ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2023ను అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించారన్నారు. యువత చిరుధాన్యాలను వినియోగించడంతో పాటు వాటి ప్రయోజనాలను ఇతరులకు వివరించాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీఎల్ రాజు మాట్లాడుతూ, ఆధునీకరణ పేరుతో పర్యావరణ పరిరక్షణ మరిచారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రకృతికి దగ్గరగా జీవించాలని సూచించారు. వ్యవసాయ పరిశోధన సంస్థ శాస్త్రవేత్త డాక్టర్ త్రివేణి మాట్లాడుతూ, చిరుధాన్యాలతో మంచి పోషకాలు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో సెట్విజ్ సీఈఓ రామగోపాల్, వ్యవసాయ, ఉద్యానవన శాఖాధికారులు ఏవీఎస్ జమదగ్ని, యు.త్రివేణి, తదితరులు పాల్గొన్నారు.

గృహప్రవేశాలకు సిద్ధం చేయాలి



నెల్లిమర్ల రూరల్: లబ్ధిదారులతో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి రమణమూర్తి

విజయనగరం రూరల్: జగనన్న కాలనీల్లో నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసి ఉగాది నాటికి గృహప్రవేశాలకు సిద్ధం చేసేలా లబ్ధిదారులను చైతన్యపరచాలని మండల ప్రత్యేకాధికారి అరుణకుమారి అధికారులను ఆదేశించారు. మండలంలోని మలిచర్ల సచివాలయం పరిధిలో శుక్రవారం హౌసింగ్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా సుంకరిపేట, మలిచర్ల గ్రామాల్లో లబ్ధిదారులు నిర్మిస్తున్న ఇళ్ల నిర్మాణాల పురోగతిని పరిశీలించారు. ఇంటి నిర్మాణాలకు సంబంధించి బిల్లులు పెండింగ్‌లో లేకుండా లబ్ధిదారుల ఖాతాల్లో ఎప్పటికప్పుడు జమ చేస్తున్నట్లు తెలిపారు. ఇళ్ల నిర్మాణాల పురోగతిపై ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జి.వెంకటరావు, హౌసింగ్ ఏఈ వర్మరాజు, ఈఓపీఆర్‌డీ తిరుపతినాయుడు, పంచాయతీ కార్యదర్శి సూర్యనారాయణ, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, మండలశాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కొండగుంపాంలో ..

నెల్లిమర్ల రూరల్: మండలంలోని కొండగుంపాంలో మండల ప్రత్యేకాధికారి ఎస్వీ రమణమూర్తి పర్యటించారు. ముందుగా సచివాలయాన్ని సందర్శించి ప్రజలకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. హౌసింగ్ డే సందర్భంగా గ్రామంలో జరుగుతున్న జగనన్న ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి త్వరితగతిన నిర్మాణాలను పూర్తి చేయాలని లబ్ధిదారులకు సూచించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ భానోజీరావు, ఏపీఎం సత్యనారాయణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పొదుపు మహిళలకు ఇండస్ట్రియల్ టూర్



బెల్లం నుంచి తయారు చేసే ఉత్పత్తుల పరిశ్రమను పరిశీలిస్తున్న పొదుపు మహిళలు

విజయనగరం అర్బన్: జిల్లాలో వనరులున్న పరిశ్రమల స్థాపనపై పొదుపు సంఘాల మహిళలకు అవగాహన కల్పించే పర్యటనలను డీఆర్‌డీఏ జిల్లా యంత్రాంగం చేపట్టింది. ఇందులో భాగంగా జిల్లాకు చెందిన పలువురు మహిళలురెండురోజులుగా మహారాష్ట్ర రాష్ట్రంలోని వివిధ పరిశ్రమలను సందర్శించారు. కార్యక్రమంలో పరిశ్రమల శాఖ ఐపీఓ బి.కళింగవర్ధన్, సెర్ప్ సిబ్బంది ఐ.కిషోర్‌కుమార్, డీపీఎం ఐహెచ్‌ఎం.జయశ్రీ, ఏపీఎం జీవీ విజయకుమార్, ప్రాజెక్ట్ డీపీఆర్ తయారు చేసిన వీవీఎస్ టెక్ సంస్థ ప్రతినిధి మురళీమనోహర్, భీమాళికి చెందిన కొయ్యాన విజయలక్ష్మి, మిడతాన వరలక్ష్మి, ఎస్‌పీవీ సభ్యులు పాల్గొన్నారు.



మామిడి తాండ్ర ఉత్పత్తులపై అవగాహన కల్పిస్తున్న మహారాష్ట్ర కంపెనీ ఉద్యోగిని

వాటర్‌ప్లాంట్లలో విజిలెన్స్ తనిఖీలు

విజయనగరం క్రైమ్: గంట్యాడ మండలం రావివలసలో ఉన్న శ్రీవారి ఆక్వా ఇండస్ట్రీస్, కేఎల్ పురంలో ఉన్న శుభకరి ఆక్వా ఇండస్ట్రీ ప్లాంట్లలో విజిలెన్స్ అధికారులు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లపై జరుగుతున్న తనిఖీల్లో భాగంగా శ్రీకాకుళం ప్రాంతీయ నిఘా అమలు అధికారి సురేష్‌బాబు ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్ బి.సింహాచలం, డీఈ సీహెచ్.సత్యనారాయణ, కానిస్టేబుల్ శేషగిరి, ఫుడ్ సేఫ్టీ అధికారులు డీకే కావ్యరెడ్డి, తదితరులు తనిఖీలు నిర్వహించారు.

మహాశివరాత్రి ఏర్పాట్లపై ఎమ్మెల్యే ఆరా



ఉత్సవ ఏర్పాట్లపై ఆరా తీస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

నెల్లిమర్ల రూరల్: పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానాన్ని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు శుక్రవారం సందర్శించారు. ముందుగా క్షేత్ర పాలకులైన ఉమా సదాశివుడి ఆలయంలో స్వామి దర్శనం అనంతరం దేవస్థాన అధికారులతో మహాశివరాత్రి ఏర్పాట్లపై ఆరా తీశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగరాదన్నారు. బోడికొండపై శిఖరదీప ప్రాంగణం వద్ద చేపట్టిన ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. శనివారం రాత్రి 6 గంటలకు శిఖర జ్యోతి ప్రజ్వలన వైభవంగా జరిపిస్తామన్నారు. కార్యక్రమంలో ఈఓ ప్రసాదరావు, తహసీల్దార్ రమణరాజు, ఈఓ ప్రసాదరావు, నగర పంచాయతీ వైస్ చైర్మన్ రామారావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు

- సీజీఆర్‌ఎఫ్ చైర్మన్ సత్యనారాయణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీజీఆర్‌ఎఫ్ చైర్మన్ సత్యనారాయణ

భోగాపురం: విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని, ఎవరైనా 1912 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి సమస్యలు తెలియజేయాలని సీజీఆర్‌ఎఫ్ చైర్మన్ బి. సత్యనారాయణ అన్నారు. శుక్రవారం స్థానిక విద్యుత్ శాఖ కార్యాలయంలో విద్యుత్‌శాఖ డిప్యూటీ ఈఈ కేఎస్‌పీ కుమార్ ఆధ్వర్యంలో విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ, విద్యుత్ సరఫరాలో ఇబ్బందులేర్పడితే ముందుగా టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. అప్పటికీ విద్యుత్ శాఖాధికారులు స్పందించని ఎడల తగిన ఆధారాలతో లిఖితపూర్వకంగా తమకు తెలియజేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. అవసరమైతే విద్యుత్‌శాఖాధికారుల నుంచి పరిహారం కూడా వసూలు చేస్తామని చెప్పారు. 2016 ఫిబ్రవరి 9 నుంచి ఇప్పటివరకు శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాల నుంచి 2,124 కేసులు వచ్చాయని, వాటిలో 1,091 కేసులను పరిష్కరించగా.. ఇంకా 33 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో టెక్నికల్ మెంబర్ పి.శ్రీనివాస్, ఫైనాన్స్ మెంబర్ ఎస్.హరిబాబు, ఇండిపెండెంట్ మెంబర్ సురేంద్ర కుమార్, విద్యుత్‌శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.ధర్మరాజు, ఏఈలు జ్ఞానేశ్వరరావు, పీఏ నాయుడు, నాగేశ్వరరావు, వినియోగదారులు, సిబ్బంది పాల్గొన్నారు.

శివరాత్రికి పక్కా ఏర్పాట్లు

- ముస్తాబైన శివాలయాలు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న బాబామెట్ట శివపంచాయతన ఆలయ కమిటీ సభ్యులు

విజయనగరం టౌన్: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని శైవక్షేత్రాలు ముస్తాబయ్యాయి. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ సభ్యులు, అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. శనివారం ఉదయం 3 గంటల నుంచి మహాశివునికి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. కంటోన్మెంట్ గూడ్స్‌షెడ్ వద్దనున్న పురాతన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో కొలువైన ఉమారామలింగేశ్వరస్వామికి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు చేపడతామని ఆలయ కమిటీ చైర్మన్ రెయ్యి శంకరరెడ్డి శుక్రవారం తెలిపారు. ఈ మేరకు ఆలయ ప్రాంగణంలో బారికేడ్లు, క్యూలైన్లు ఏర్పాటు చేయడంతో పాటు ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. స్వామివారికి రుద్రాభిషేకాలతో పాటు ఆలయంలో ఉన్న శనీశ్వరునికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఈఓ శ్రీనివాస్, అర్చకులు సోమశేఖరశర్మ, సభ్యులు శోభారాణి, రవి తదితరులు పాల్గొన్నారు. అలాగే బాబామెట్ట శివపంచాయతన ఆలయంలో వేకువజామున 4 గంటల నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కేపీ రాజు (శివ), పి.శివకుమార్, కోశాధికారి టి.సాంబమూర్తిరాజు తెలిపారు. ఈ మేరకు ఆలయ ఆవరణలో శుక్రవారం కరపత్రాలను ఆవిష్కరించారు.

సీతంలో సాంకేతిక అభివృద్ధిపై సదస్సు



జపాన్ శాస్త్రవేత్తలను సత్కరిస్తున్న సీతం కళాశాల ప్రతినిధులు

విజయనగరం అర్బన్: గాజులరేగ సీతం ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం జరిగిన అంతర్జాతీయ సదస్సులో జపాన్‌కు చెందిన పలువురు శాస్త్రవేత్తలు పాల్గొన్ని దేశంలో జరుగుతున్న సాంకేతిక అభివృద్ధిపై చర్చించారు. జపాన్‌లోని రోడ్లు, భవనాల నిర్మాణ వ్యవస్థలో వినియోగిస్తున్న అత్యాధునిక విధానాలను వివరించారు. కార్ల తయారీలో ఉపయోగించే సాంకేతికతపై అవగాహన కల్పించారు. అతివేగంగా ప్రయాణించే కార్ల స్టీరింగ్ వ్యవస్థ నిర్మించడంలోనూ, అతి శీతల ప్రదేశాల్లో ఇంధనం, కందెనలు గడ్డ కట్టకుండా ఉండేటట్లు చేపట్టిన సమస్యల పరిష్కార మార్గాలను వివరించారు. అనంతరం ముఖ్యఅతిథులను కళాశాల ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సత్య సంస్థల సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ డాక్టర్ బొత్స ఝాన్సీలక్ష్మి ఆధ్వర్యంలో రెండు రోజులుగా జరుగుతున్న సదస్సులో జపాన్ శాస్త్రవేత్తలు మునేతోషి మసానోబు, యోసియాకి ఆనన్, రామ్‌తేజ్ టెక్నాలజీస్ సంస్థ అధినేత శాసుపల్లి సన్యాసిరావు, కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు, తదితరులు పాల్గొన్నారు.

2024 ఎన్నికల్లో విజయమే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



హాజరైన గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు

- గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు సైనికుల్లా పని చేయాలి
- ఏపీ శాసనసభా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: రానున్న 2024 సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు సైనికుల్లా పనిచేయాలని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పిలుపునిచ్చారు. నగరంలోని సుజాత కన్వెన్షన్ హాల్‌లో గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ముందుగా మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడుతూ, దేశం గర్వపడే విధంగా ప్రజా సంక్షేమపాలన అందిస్తున్న వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆశయాలను ప్రజల చెంతకు తీసుకువెళ్లాల్సిన బాధ్యత వైఎస్సార్‌సీపీ శ్రేణులపై ఉందన్నారు. మా నమ్మకం నువ్వే జగనన్న అన్న నినాదంతో ముందుకు సాగుతూ అభివృద్ధి ఫలాలు అందుకుంటున్న లబ్ధిదారులకు జగనన్న ఆశయాలు, పార్టీ సిద్ధాంతాలను వివరించాలని కోరారు. ఇదేక్రమంలో ప్రతిపక్ష పార్టీల విమర్శలు, ఆరోపణలను తిప్పికొట్టే విధంగా ప్రతి ఇంటికి వెళ్లి పార్టీ విధానాలను వివరించాలని చెప్పారు. నియోజకవర్గంలో తాము చేస్తున్న అభివృద్ధి నిరంతరాయంగా కొనసాగుతుందన్నారు. ప్రధాన జంక్షన్ల అభివృద్ధి, రహదారుల ఏర్పాటు వంటి పనులు చేస్తున్నట్లు చెప్పారు. సంక్షేమ పథకాలతో ఎంతోమంది ప్రజలు ఆనందంగా ఉన్నారన్నారు. జేసీఎస్ నియోజకవర్గ కన్వీనర్ ఎస్‌వీవీ రాజేష్, పార్టీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు మాట్లాడుతూ, రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అందిస్తున్న పాలనతో పాటు నియోజకవర్గస్థాయిలో కోలగట్ల వీరభద్రస్వామి చేస్తున్న అభివృద్ధితో ప్రజలు సుఖసంతోషాలతో ఉన్నారన్నారు. నగరాన్ని అభివృద్ధి చేస్తున్న ఘనత కోలగట్లకే దక్కుతుందని చెప్పారు. సమావేశంలో వివిధ డివిజన్ల జోనల్ ఇన్‌చార్జ్‌లు, కార్పొరేటర్లు, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, డివిజన్ అధ్యక్షులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొన్నారు.